క్లుప్తంగా

'ఓపెన్' దరఖాస్తుల ఆహ్వానం

నర్సంపేట : పాఠశాల విద్యకు దూరమైన విద్యార్థులు తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ విద్యా సంవత్సరం 2023–24 పదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు ఆగస్టు 10వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చని జెడ్పీఎస్ఎస్ మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు జి.రమేష్‌బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాచారం కోసం పాఠశాల అధ్యయన కేంద్రం సహ కో ఆర్డినేటర్ పోతుగంటి కుమారస్వామిని సంప్రదించాలని అన్నారు. వివరాలకు 96401 62614నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పండ్ల తోటల పెంపకానికి దరఖాస్తు చేసుకోవాలి

ఖానాపురం : గ్రామీణ ఉపాధిహామీ, ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో పండ్ల తోటల పెంపకానికి, బిందుసేద్య పరికరాల కోసం ఆసక్తిగల రైతులు దరఖాస్తులు చేసుకోవాలని ఉద్యాన అధికారి జ్యోతి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మామిడి, బత్తాయి, నిమ్మ, జామ, సపోటా, సీతాఫలం, మునగ ఐదు ఎకరాల లోపు, డ్రాగన్ ఫ్రూట్ అర ఎకరం, గట్లపై కొబ్బరి, నేరేడు, చింత, కరోండ మొక్కలను అందించనున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీపై డ్రిప్ పరికరాలు అందించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల రైతులు ఈనెల 31లోపు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 79977 25417ను సంప్రదించాలన్నారు.

కొమ్మాల ఆలయ హుండీ లెక్కింపు



గీసుకొండ : మండలంలోని కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం లెక్కించారు. హుండీ ఆదాయం రూ.1,91,674 వచ్చిందని ఈఓ గుల్లపెల్లి శేషగిరి తెలిపారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సంజీవరెడ్డి, వంశపారంపర్య ధర్మకర్త చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గద్దమీది కుమారస్వామి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ

ఖానాపురం: మండలంలోని ధర్మరావుపేటకు చెందిన సోమక్క అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. కాగా బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పరామర్శించారు. సోమక్క మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట నియోజకవర్గ కన్వీనర్ రవీందర్‌రావు, నెక్కొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల జగన్‌మోహన్‌రెడ్డి, వేములపల్లి వెంకటప్రసాద్, ఓబీసీ సెల్ అధ్యక్షుడు వల్లె శ్రీనివాస్, ముస్తఫా, ఎల్లగౌడ్, తదితరులు పాల్గొన్నారు. అలాగే జెడ్పీటీసీ బత్తిని స్వప్న, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ వెన్ను శృతిపూర్ణచందర్ నివాళులర్పించి పరామర్శించారు.

నీటిని తొలగించుకోవాలి

ఖానాపురం : భారీ వర్షాల కారణంగా పత్తి పంటలో నిలిచిన నీటిని రైతులు తొలగించుకోవాలని మండల వ్యవసాయ అధికారి బోగ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పత్తి పంటలో చిన్న చిన్న కాల్వలు తీసి నీటిని వెంటనే బయటకు తొలగించుకోవాలని సూచించారు. లేనిచో తెగుళ్లు, కుళ్లిపోవడం, మొక్కలు చనిపోవడం జరుగుతుందని తెలిపారు. వర్షాలు తగ్గిన తర్వాత 19:19:19(నత్రజని, భాస్వరం, పొటాష్)5 గ్రాములు లీటరు నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు.

మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేత

పర్వతగిరి : భారీ వర్షాల కారణంగా వర్ధన్నపేట పాత బ్రిడ్జి వద్ద మిషన్ భగీరథ పైపులైన్ ధ్వంసం కావడం జరిగిందని, దీంతో వర్ధన్నపేట, పర్వతగిరి మండలాల్లోని ఆయా గ్రామాలకు నీటి సరఫరా నిలిపివేయడం జరిగిందని మిషన్ భగీరథ ఏఈఈ సాయిరాం మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద తగ్గుముఖం పట్టిన తర్వాత మరమ్మతులు చేసి నీటి సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం



దుగ్గొండి : మండలంలోని గోపాలపురంలో దుగ్గొండి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 85 మంది రోగులకు డాక్టర్ భరత్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలలో నీరు నిల్వకుండా చూసుకోవడంతో పాటు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఏఎన్ఎం అరుణ, సునీత, బుజ్జమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్ధన్నపేట: ఉప్పొంగి ప్రవహిస్తున్న ఆకేరు వాగు



నెక్కొండ: గుండ్రపల్లి కల్వర్టు వద్ద సమీక్షిస్తున్న అధికారులు



దుగ్గొండి: ఆరు మోరీల వాగు దారిని బంద్ చేసిన పోలీసులు



సంగెం: చింతలపల్లి-వరంగల్ రహదారిపై నిలిచిన రాకపోకలు



ముంచెత్తిన వాన

అల్పపీడన ప్రభావంతో జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో వరద పోటెత్తింది. చెరువులు, కుంటల్లో వరద ప్రవాహం ముంచేసింది. అనేక రహదారులు ధ్వంసమయ్యాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. కల్వర్టులు దెబ్బతిన్నాయి. పలు ఇళ్లు నేలమట్టమయ్యాయి. అధికారులు, పోలీసులు రహదారులు మూసి పహారా కాస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



నర్సంపేట-నెక్కొండ రహదారి లోలెవెల్ కాజ్‌వే..



చెన్నారావుపేట: మత్తడి పోస్తున్న కోపాకుల చెరువు



సంగెం: జాటోత్ తండా- ఏనుగల్ రోడ్డు



చెన్నారావుపేట: ఉప్పరపల్లి- సీతారాంపురం రోడ్డుపై పడిన గండి



పర్వతగిరి: గోపనపల్లి ఊర చెరువు మత్తడి..



నల్లబెల్లి: ఉధృతంగా ప్రవహిస్తున్న రేలకుంట వాగు



ఖానాపురం: మంగళవారిపేటలో కూలిన గోడ



నెక్కొండ: నర్సంపేట-నెక్కొండ రహదారిలో..



చెన్నారావుపేట: పత్తి చేనులో నిలిచిన నీరు



గీసుకొండ: కూలిన ఇంటి వద్ద ఐలమ్మ



చెన్నారావుపేట: కోనాపురంలో కూలిన ఇల్లు



సంగెం: రోడ్డుపై ప్రవహిస్తున్న వరద



వర్ధన్నపేట: ఆకేరు వాగులో పొక్లెయినర్



నెక్కొండ: పంచముఖాంజనేయ స్వామి ఆలయం చుట్టూ చేరిన వరదనీరు



గీసుకొండ: మత్తడి పోస్తున్న బస్వన్న చెరువు



చెన్నారావుపేట: మగ్దుంపురం చెరువు వద్ద ఎస్సై



ఖానాపురం : మత్తడి పోస్తున్న దూసముద్రం..



నర్సంపేట-గురిజాల లోలెవెల్ కాజ్‌వే..



చెన్నారావుపేట: నీటితో నిండిన గొల్లపల్లి రోడ్డు

చెరువు కట్టలకు పొంచి ఉన్న ప్రమాదం

సంగెం : సోమవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. కుంటలు, చెరువులు మత్తళ్లు పోస్తున్నాయి. దీంతో మండలంలోని గవిచర్ల, నల్లబెల్లి ఊర చెరువు కట్టలు కుంగిపోయి ప్రమాదకరంగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు. కాగా గవిచర్లలో కుంగిన చెరువు కట్టను ఐబీ డీఈ గణేష్ మంగళవారం సందర్శించి పరిశీలించారు. చెరువు కట్టకు ప్రమాదం జరగకుండా ఉండేందుకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టామన్నారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు కట్టలను పరిశీలించి సమస్యలుంటే తెలియజేయాలని కోరారు.

అడ్డుకట్టగా ఇసుక బస్తాలు

పర్వతగిరి : రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని వడ్లకొండ ఊర చెరువు ఆనకట్ట సమీపంలో చెరువు కట్టపై నుంచి నీరు ప్రవహిస్తోంది. దీంతో కట్ట తెగే ప్రమాదం ఉండడంతో గ్రామస్తులు, రైతులు మంగళవారం సర్పంచ్ ఆమడగాని రాజుయాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సర్పంచ్ ఇసుక బస్తాలతో నీటి ప్రవాహానికి అడ్డు కట్ట వేయించారు. గ్రామస్తులు, రైతులు, యువకులు ఉన్నారు.



సంగెం: గవిచర్లలో కుంగిన చెరువు కట్టను పరిశీలిస్తున్న ఐబీ డీఈ తదితరులు

క్షీరాభిషేకం



కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న వీఆర్ఏలు

దుగ్గొండి : ప్రభుత్వం వీఆర్ఏలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ జీఓ జారీ చేయడాన్ని హర్షిస్తూ మండల కేంద్రంలో వీఆర్ఏలు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. తాళ్ల సారయ్య, సుద్దపల్లి రాజు, నాగరాజు, రవీందర్, సారంగం, కుమారస్వామి, రమేష్, రాజేందర్, స్వామి పాల్గొన్నారు.

ముంపు కాలనీల పరిశీలన

వర్ధన్నపేట : మండలంలోని ఇల్లందలో వర్షపు నీటిలో మునిగిన కాలనీ వాసుల ఇళ్లను రిటైర్డ్ పోలీస్ కమిషనర్ కేఆర్ నాగరాజు మంగళవారం సందర్శించి బాధితులను పరామర్శించి వారికి భోజనం ప్యాకెట్లు, పండ్లు, బిస్కెట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముందస్తు చర్యలు తీసుకుంటే ఇలాంటి పరిస్థితి ఏర్పడేది కాదన్నారు. నాగరాజు వెంట ఎద్దు సత్యనారాయణ, నాయకులు వెంకన్న, రవీందర్‌రెడ్డి, సమ్మయ్య ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్

గీసుకొండ : జిల్లాలో అతి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతేనే ఇంటి నుంచి బయటకు రావాలని కలెక్టర్ పి.ప్రావీణ్య సూచించారు. గ్రేటర్ 16వ డివిజన్ గరీబ్‌నగర్‌లోని ముంపు ప్రాంతాలను ఆమె మున్సిపల్ కమిషనర్ షేక్ రిజ్వాన్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. మరో రెండు రోజులపాటు భారీ వర్ష సూచనలు ఉన్నాయని జాగ్రత్తగా ఉండాలని కలెక్టర్ ప్రజలను కోరారు. కాగా, గతంలో గరీబ్‌నగర్ వాసులు వరద నీటితో ఇబ్బంది పడేవారని, ఇటీవల డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణంతో వారి సమస్య తీరిందని కార్పొరేటర్ సుంకరి మనీషా శివకుమార్ కలెక్టర్‌కు వివరించారు.



గరీబ్‌నగర్‌లో పర్యటిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషా

ఓటరు నమోదులో బీఎల్ఓలే కీలకం

శాయంపేట : ఓటరు నమోదులో బీఎల్ఓలదే కీలక పాత్ర అని భూపాలపల్లిజయశంకర్ డీపీఓ ఎన్నికల సూపర్‌వైజర్ ఆశాలత అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం రెండో స్పెషల్ రివిజన్–2023పై బూత్‌స్థాయి అధికారులకు, సూపర్‌వైజర్లకు శిక్షణ తరగతుల కార్యక్రమానికి తహసీల్దార్ చల్లమల్ల రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఆశాలత పాల్గొని మాట్లాడుతూ ఓటర్ల జాబితా తయారీలో బీఎల్ఓల పాత్ర నిర్వర్తించాల్సిన విధుల గురించి వివరించారు. 2023 అక్టోబర్ 1 వరకు 18ఏళ్లు నిండి వారి నుంచి ఓటరు నమోదు చేయాలని సూచించారు. మృతి చెందిన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగించాలని , తప్పులను సవరించాలని వివరించారు. ఈ ఏడాది చివరి నెలలో ఎన్నికలు రాబోతున్నాయని సమగ్రమైన ఓటర్ల జాబితా తయారీలో బీఎల్ఓలు కీలకపాత్ర పోషించాలని సూచించారు. డీటీ భద్రునాయక్, బీఎల్ఓలు పాల్గొన్నారు.

చెవిలో పూలతో వినూత్న నిరసన



ఖానాపురం: చెవిలో పూలతో నిరసన తెలుపుతున్న గ్రామపంచాయతీ కార్మికులు

ఖానాపురం : గ్రామ పంచాయతీ కార్మికుల తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె మంగళవారం కొనసాగింది. ఈ సందర్భంగా జీపీ కార్మికులు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో చెవిలో పూలతో నిరసన తెలిపారు. అనంతరం జేఏసీ మండల అధ్యక్షుడు కాసు యాకయ్య మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికుల పట్ల కఠినంగా వ్యవహరించడం దుర్మార్గమన్నారు. ఉస్మాన్, కుమారస్వామి, భిక్షపతి, యాకూబ్ పాల్గొన్నారు.

20వ రోజుకు చేరిన సమ్మె..

దుగ్గొండి : సమస్యలు పరిష్కరించాలని జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె దీక్షలు మంగళవారం 20వ రోజుకు చేరాయి. జేఏసీ అధ్యక్షుడు గాదం రాజాలు, పొన్నం రమేష్, పుట్టపాక రాజేందర్, ముస్కు రాజు, భగవాన్‌రెడ్డి, యాకయ్య, సదయ్య, స్వామి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.



దుగ్గొండి: నినాదాలు చేస్తున్న జీపీ కార్మికులు

శరవేగంగా రోడ్డు నిర్మాణ పనులు

- రూ. కోటి 20లక్షలతో పనులు షురూ
- వారం రోజుల్లో పూర్తి కానున్న నిర్మాణం

పర్వతగిరి : నూతన రోడ్డు నిర్మాణంతో వాహనదారులు, ప్రయాణికుల బాధలు తీరనున్నాయి.. గుంతలరోడ్డుతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న వారి కష్టాలు తొలగనున్నాయి.. వర్ధన్నపేట ఎమ్మెల్యే సహకారంతో నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి.. మండల కేంద్రం నుంచి నెక్కొండ రోడ్డు అంగడి మీదుగా చెరువు కట్ట వరకు సుమారు కిలో మీటరు మేర చేపట్టిన రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. 500మీటర్లు సీసీ రోడ్డు, 500మీటర్లు బీటీ రోడ్డు పనులు సాగుతున్నాయి. 7మీటర్ల వెడల్పుతో చేపట్టిన నిర్మాణాలతో శాశ్వతంగా రోడ్డు పనులు నిలువనున్నాయి. సుమారు ఫీటున్నర పైగా సీసీ వేయడంతో రోడ్డు పనులు మరింత పటిష్టంగా ఉండే అవకాశం ఉంది. రోడ్డు పూర్తిగా ధ్వంసం కావడంతో అటు వైపు వెళ్లే వాహనాల వల్ల దుమ్ముధూళి వచ్చి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఎమ్మెల్యేను గ్రామస్తులు కోరారు. దీంతో రూ.కోటి 20లక్షల నిధులతో చేపట్టిన రోడ్డు పనులు వారం రోజుల్లో పనులు పూర్తి కానున్నాయి. ఈ రోడ్డు నిర్మాణం వల్ల రవాణా సౌకర్యం బాధలు తొలగనున్నాయి.



నెక్కొండ రోడ్డులో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు

సౌకర్యవంతంగా ఉంది

గుంతల రోడ్డు వల్ల అనేక ఇబ్బందులకు గురయ్యే వాళ్లం. ఇప్పుడు రోడ్డు పనులు జరుగుతుండడంతో అందరికి సౌకర్యవంతంగా ఉంది. రోడ్డు పనులు పూర్తయితే గ్రామస్తులు, వాహనదారుల ఇబ్బందులు తొలగనున్నాయి.



– యాకయ్య, పర్వతగిరి

పనులు చేస్తున్నాం..

మండల కేంద్రంలో చేపట్టిన రోడ్డు పనులు పటిష్టంగా చేపడుతున్నాం. ఎప్పటికప్పుడు అధికారుల పర్యవేక్షణలో రోడ్డు పనులు జరుగుతున్నాయి. పనులను నిబంధనల మేరకు నాణ్యతగా పూర్తి చేస్తున్నాం.

–రత్నశేఖర్, ఏఈ, ఆర్అండ్‌బీ

గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ మృతి



సూర్యనారాయణ (ఫైల్)

ఖానాపురం : గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని కుందనపల్లికి చెందిన మద్దెల సూర్యనారాయణ(54) ఖానాపురం పోలీస్‌స్టేషన్‌లో కొంత కాలంగా హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ క్రమంలో ఇంటి వద్ద ఉదయం గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. కాగా, బాధిత కుటుంబానికి వరంగల్ సీపీ రంగనాథ్ ఆదేశాల మేరకు పోలీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.20వేల ఆర్థిక సాయాన్ని ఎస్సై తిరుపతి, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు శోభన్ ఆధ్వర్యంలో అందజేశారు. బాధిత కుటుంబాన్ని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, సర్పంచ్ ప్రవీణ్‌కుమార్ పరామర్శించారు.

చికిత్స పొందుతున్న వాచ్‌మన్..



పెద్ద సాంబయ్య (ఫైల్)

నల్లబెల్లి : నల్లబెల్లి సీతారామాంజనేయస్వామి ఆలయ వాచ్‌మన్‌గా పని చేస్తున్న జక్కుల పెద్ద సాంబయ్య(81) మంగళవారం ఎంజీఎంలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సోమవారం ఆలయంలో పనిముగించుకుని ఇంటికి వస్తున్న క్రమంలో స్థానికుడైన పెండ్యాల మహేందర్‌ను పిలిచి తనను ఇంటివద్ద దింపమని కోరాడు. దీంతో మహేందర్ తనను బైక్‌పై తీసుకు వస్తుండగా కళ్లు తిరిగి బైక్ మీది నుంచి రోడ్డుపై పడిపోవడంతో తలకు గాయమైంది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై నగేష్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తోలవాగు సమస్య తీరింది



గీసుకొండ : మండలంలోని చంద్రయ్యపల్లి–మనుగొండ తోలవాగు దారిలో వర్షాలు కురిస్తే వరద నీరు ప్రవాహంతో ఇరు గ్రామాల మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగేది. దీనిపై బ్రిడ్జి లేదా కల్వర్టు నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కొంత కాలంగా అధికారులు, ప్రజా ప్రతినిధులకు మొరపెట్టుకున్నారు. ఈ సమస్యపై కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజలు పలుమార్లు ఆందోళన చేపట్టారు. కలెక్టర్‌తోపాటు పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి దృష్టికి సమస్యను తీసుకుని వెళ్లడంతో నిధులు మంజూరు చేయగా వాగుపై వేసవి కాలంలో కల్వర్టును నిర్మించారు. దీంతో ఇరు గ్రామాల మధ్య రాకపోకలకు ఇబ్బంది తప్పడంతో మంగళవారం స్థానిక సర్పంచ్ ఆకుల స్రవంతిరుద్రప్రసాద్, గ్రామస్తులు అధికారులు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.